# భోజనానందం

సృష్టి రహస్యం చాలా గొప్పది. ఆ రహస్యాన్ని కనుక్కోవటం చాలా కష్టం. పుట్టుకొచ్చిన ప్రతి జీవికి ఒక లక్ష్యం, అర్ధం , పరమార్ధం ఉండి తీరుతాయని మన పెద్దవాళ్ళ ఉవాచ. కానీ ఏ కార్యం వెలగబెట్టటానికి మనం భూమ్మీద పడ్డామో తెలీక సతమతమైపోయి, అల్లాడి పోతాం. అనేక కార్యాలు ట్రయి చేస్తాం. విసిగిపోతాం. అదృష్టం బావుంటే కన్నుమూసే లోపు కనిపెడతాం. లేకపోతే అయోమయంగా తెల్ల మొహం పెట్టుకుని తెరమరుగవుతాం. కాని కొంత మంది గొప్ప వాళ్ళకి జన్మ రహస్యం , కారణాలు పాలుతాగే రోజుల్లోనే తెల్సిపోవడం చేత సరాసరి వచ్చిన పన్లని చక్కదిద్ది చరిత్రలో కెక్కుతారు. ధర్మ స్థాపనకి పుట్టుకొచ్చే వాళ్ళు కొంతమందయితే , ఆడవాళ్ళని , బలహీన వర్గాల వారిని ఉద్ధరించటానికి ఇంకొంత మంది పుట్టుకొస్తారు. ప్రజా సేవకి, కళా సేవకి, విడో ఉద్ధరణకి, క్రీడారంగ ప్రగతికి ఇలా అనేకానేక మంది అనేకానేక కారణాలవల్ల జన్మిస్తారు కాని కొంతమంది కేవలం భోజన కార్యక్రమంకోసమే జన్మిస్తారు. పుట్టిన మరుక్షణం వీళ్ళకి తమ జన్మకికారణం ఇట్టే తెల్సిపోతుంది. వెంటనే పని ప్రారంభిస్తారు. చేతికి దొరికిన దానినల్లా నోట్లోకి రవాణా చేస్తారు. అన్నం ప్రాసననాడే అరగొౌట్టం అన్నం తినెయ్యగల్రు. వీళ్ళకి భోజన కార్యక్రమం దైవ పూజంత పవిత్రం. దానిలో ఆనందాన్ని, ఆది శంకరుడిని దర్శించగలరు. భోజనానంద సమాజంలో వీళ్ళంతా శాశ్వత సభ్యులు .

తమ జీవిత లక్ష్య సాధనలో పొలాల్ని , ఇళ్ళనీ, నగలూ నట్రల్నీ అమ్మేసి చరితార్ధులైన భోజనానంద మహర్షులున్నారు. ముప్పొద్దులా కడుపారా తిని హరాయించుకోవడం వాళ్ళకే చెల్లు. విత్తు ముందా చెట్టుముందా అన్నట్టు అరిగిపోతుందని తింటున్నారా ? తింటున్నారు కాబట్టి హుతం అయిపోతుందా అనేది వాళ్ళకూడా అంతుబట్టని క్లిష్ట సమస్య , బద్ధ శత్రువు వచ్చి భోజనానికి పిల్చినా చిర్నవ్వుతో వెడతారే తప్ప రానని చస్తే అనరు. విధి నిర్వహణలో వీళ్ళు దేనికీ వెనుకాడరు. పట్టుదల వీళ్ళకి శ్రీరామరక్ష. వజ్రకవచం , మాసిక భోజనానికి వెళ్ళటానికి అవసరమైతే మహా సముద్రాన్నయినా ఈదేస్తారు. ఈమధ్యన భోజనానంద సమాజంలో సభ్యుడొకడు నాకనిపించాడు. కనిపించి నా పైన కనికరం కొద్దీ వాళ్ళ

ఫిలాసఫీని నాకు వివరంగా చెప్పేడు. వాటి వివరాలు ప్రస్తుతానికి మీకు క్లుప్తంగా చెపుతాను.

ప్రతి మనిషిలోనూ భగవంతుడున్నాడన్న వాదాన్ని, నమ్మకాన్ని వాళ్ళూ ఒప్పుకుంటారట. శిరసావహిస్తారట., వాళ్ళు ఎగబడి రోజుకి ఎన్ని సార్లయినా సరే భోజనం చేసేది వాళ్ళ కోసం కానేకాదట. లోనున్న పరమాత్ముడికి నైవేద్యంట. వారు తృప్తిగా , ఆరోగ్యంగా ఉంటేనే మనకి ఆరోగ్యం , ఆనందంట. అసలు దేవుడు మనిషికి రెండు కాళ్ళు ఎందుకిచ్చాడు ! మార్కెట్టుకెళ్ళి కూరలు తెచ్చుకోటానికిట. కళ్ళు కల్తీ సరుకుని త్యజించటానికి. చెవులు భోజనానికి రమ్మనే కమ్మని , పవిత్రమైన పిలుపు వినటానికి. ఇహ నోరు సరే సరి . రెండు చేతులూ ఇచ్చింది రెండు చేతులా తినమనేనట.వాళ్ళకీ అలా తినాలనే ఉంటుందట. కానీ పక్కనుండే అజ్ఞానుల కోపాగ్నికి బలికావటం ఇష్టం లేక ఒంటి చేత్తోనే కార్యక్రమం కానిస్తున్నారట. వీళ్ళల్లో కొంత మంది గ్రంథ రచనలకి గూడా పూనుకున్నారట. ప్రకృతి వర్ణనల్లో గూడా వాళ్ళు తమ ఫిలాసఫీని చస్తే మర్చిపోరట.సూర్యోదయాన్ని అప్పుడే పెళ్ళి భోజనం చేసి బయటపడ్డ బంధువులాగాను, సూర్యాస్తమయాన్ని ఉపవాసదీక్షని విరమించటానికి ఇంటికొస్తున్న ఇంటాయన లాగాను చిత్రిస్తారట. నక్షత్రాలని వడియాలని , చంద్రుడు బియ్యప్పిండి డబ్బాలోపడిపోయిన అప్పడం అని, జలపాతం అంటే మంచి నెయ్యిని పరమేశ్వరుడు పైనించి ప్రవహింపచేస్తున్నాడని వ్రాసుకుంటారట. ఉపవాస దీక్షల తంతు వీళ్ళకి పెద్ద కుట్రలాగా కనిపిస్తుందట. అంచేత వీళ్ళల్లోని కొంత మంది అతివాదుల పర్వదినాల్లో పనిగట్టుకుని పదిసార్లు భోజనం చేస్తారట. వీళ్ళ థియరీ ప్రకారం భూమి తన చుట్టూ తాను తిరుగుతూనే, బియ్యం మూట చుట్టూ తిరుగుతుందిట. ఇంకా చాలా చెప్పాడు. కానీ భోజనం వేళయింది. అంచేత మిగతా వివరాలు తమరికి తర్వాత తీరుబడిగా విన్నవించుకోగల్ను.

అయినా మన కడుపుని మనం నింపుకోవటంలో విచిత్రం ఏమీ లేదు. కానీ ఆకలి భాదతో అలమటిస్తున్న మరొకరి పొట్టనింపడం మానవత్వం. మహోనీయత్వం. సొంత తిండిని కొంత మాని పక్కవాడికి తినిపించవోయ్ ! భోజనానందం తింటేనే కాదు తినిపించినా వస్తుంది కావాలంటే ట్రయ్ చెయ్యండి మరి !

------- అయ్యిపోయింది -------